క్లుప్తంగా

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సోమన్నచౌదరి

రంగంపేట: రానున్న వార్షిక పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపాలని మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన పదో తరగతి ప్రేరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మంచి మార్కుల సాధనకు విద్యార్థులకు సూచనలిచ్చారు. మంచి మార్కులు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రస్తుత విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధిస్తారనే నమ్మకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని సర్పంచ్ వేము మాధవి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కేతా రామదాసు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ వేము చిరంజీవి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



వెదుళ్లపల్లి హైస్కూల్లో ఉత్తమ రైతును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయుడు సతపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ నాగరికతలో మొదటి శాస్త్రవేత్త రైతు అన్నారు. భూమి నుంచి ధాన్యం పండించి ప్రజల ఆకలి తీర్చాడన్నారు. అనంతరం ఉత్తమ రైతు తన్నీరు త్రిమూర్తులును ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం సీతారత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల యువజన విభాగం అధ్యక్షుల నియామకం

అనపర్తి: నియోజకవర్గ పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులను శనివారం నియమించారు. పార్టీ అనపర్తి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా పడాల విజయానందరెడ్డి, బిక్కవోలు మండలానికి సంబంధించి కొవ్వూరి నవీన్‌కుమార్, పెదపూడి మండలానికి గుడిమెట్ల మురళీకృష్ణ, రంగంపేట మండలానికి సంబంధించి పేపకాయల మణికంఠలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



బలభద్రపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో ఎంపీటీసీ సభ్యుడు మేడపాటి ఆనందరెడ్డి కుమారుడు నాగ సుధీర్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఎంపీపీ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఏటా గ్రామంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నామ తలంబ్రాలకు అంకురార్పణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, పీఈటీ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి ముక్కోటి ఏకాదశి సందర్భంగా బియ్యపు గింజలపై శ్రీరామ అనే మంత్రాన్ని రాసే తలంబ్రాలకు శనివారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.మామిడాడ కోదండ రామాయలంలో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమికి ఈ తలంబ్రాలు సమర్పిస్తానన్నారు.

నేడు వికసిత్ యాత్ర

రంగంపేట: రంగంపేట, సుభద్రంపేట గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.సాయిరాం తెలిపారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, ఎంఎస్ఆర్‌కే రాజు హాజరవుతారన్నారు.





కోరుకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వడిశలేరులో భజే నారాయణస్వామి గ్రామోత్సవం



బిక్కవోలులో గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం చేస్తున్న అర్చకులు

కోటి పుణ్యాల సాటి.. ముక్కోటి ఏకాదశి

- గ్రామాల్లో వెల్లువెత్తిన ఆధ్యాత్మికత
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా శనివారం గ్రామగ్రామాన ఆధ్యాత్మికత వెల్లువెత్తింది. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో, దేవతామూర్తులను వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు చేసిన విష్ణు సహస్ర నామ పారాయణ, గోవింద నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. పలు ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించేందుకు భక్తులు వేకువజాము నుంచే పోటెత్తారు. ఉత్తరాయణ కాలంలో వైకుంఠ ద్వార ప్రవేశంతో దేవతామూర్తులను దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. విష్ణాలయాలు, వెంకన్న ఆలయాలకు అశేష భక్తజనం తరలివచ్చి భక్తి ప్రపత్తులతో స్వామి వార్లను దర్శించుకున్నారు.

అనపర్తి: స్థానిక పాతవూరిలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దన స్వామి వారి ఆలయంలో స్వామి వారికి చామంతి పూలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాతవూరిలోని సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రామాలయంలో వేట్లపాలెం గ్రామానికి చెదిన పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భజన బృందం ఏకాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలమూరులోని మదనగోపాల స్వామివారి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దర్శనానికై భక్తులు పోటెత్తారు.

బిక్కవోలు: స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం వద్ద గరుడ వాహనం ద్వారా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పందలపాక వెలంపేట రామాలయం వద్ద ఏకాహం జరిపారు. బలభద్రపురం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల కోసం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

పెదపూడి: సంపర, జి.మామిడాడల్లో వేంకటేశ్వర స్వామి, పెదపూడిలో జనార్దనస్వామి, జి.మామిడాడలో సూర్యదేవాలయం, కోదండ రామాలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు స్వామికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరులో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత భజేనారాయణస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా శనివారం స్వామి వారిని కల్కి అవతారంలో అలంకరించారు. శనివారం వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వేకువ జాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి

మధురపూడి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 5.30 నుంచి ఉత్తర ద్వారం ద్వారా భక్తులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామికి పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

- కోరుకొండ మండలంలోని పలు ఆలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడింది. కోరుకొండ మరంగంటివారి రామాలయంలోని సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు. రామాలయం నుంచి ప్రారంభమై కాపవరం వరకూ జరిగింది. కార్యక్రమాల్లో అన్నవరం దేవస్థానం ఏసీ రమేష్‌బాబు, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పసుపులేటి బుల్లియ్య నాయుడు, బొండాడ చందు, అయిల రామకృష్ణ, మరంగంటి శ్రీను, కోడూరి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంపరలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు హనుమంతాచార్యులు

సీతానగరం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీతానగరం విష్ణాలయంలోని కొలువైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులను అనుమతించారు. ధర్మదాయ, దేవదాయశాఖ ఈవో సోమాల శివ, ఆలయ కమిటీ ఛైర్మన్ సలాది వాసులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే కొడమంచిలి శ్యామలరావు గురుస్వామి, రాముస్వామి ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహించారు. వంగలపూడిలోని సీతారామస్వామి, రఘుదేవపురంలోని దాసాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జాలిమూడిలో లక్ష్మీనరసింహస్వామి, మునికూడలిలోని సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు.



అనపర్తి రామాలయంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు



సీతానగరం విష్ణాలయంలో వేణుగోపాలస్వామి



చామంతి పూలతో ప్రత్యేక పూజలందుకున్న అనపర్తి జనార్దన స్వామి



కోరుకొండలో గ్రామోత్సవం

అన్నసమారాధన



ఆలయ గురువు రామారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. ముక్కోటి ఏకాదశి, ఆలయ గురువు మామిడిపల్లి రామారావు పుట్టిన రోజు సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ గురువు రామారావును సత్కరించారు. అనంతరం భక్తులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కంటే నాగ కేశవరావు, సభ్యులు కంటే సత్యచక్ర గణపతి, మూతిన శివ మోహన్, గూడపాటి పెద్ద, కోరుమిల్లి కుమార్, బుడ్డిగ వీరపండు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష తులసి పూజ



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ శనివారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పడాల అబ్బులరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు గరిమెళ్ళ గాంధీ, 12 మంది రుత్వికులు శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

31 వరకూ ధాన్యం కొనుగోలు



వలవల వెంకట్రాజు

సీతానగరం: రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ నెల 31 వరకూ ధాన్యం కొనుగోళ్లు జరుగుతాయని మండల ఆర్‌బీకే ఛైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు) తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో వరి కోతలు జరిపి ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మిచాంగ్ తుపాన్‌తో నష్టపోయిన పంటల తుది నివేదిక త్వరలో సిద్ధమవుతుందన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి, అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు.

విజయవంతంగా వన్‌కే రన్



సీతానగరంలో వన్‌కే రన్ విజేతలకు పతకాల ప్రదానం



కోరుకొండలో వన్‌కే రన్ నిర్వహిస్తున్న క్రీడాకారులు, అధికారులు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి కోరుకొండ బస్టాండ్ సెంటర్ వరకూ శనివారం వన్ కే రన్ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీడీఓ పీఎస్ సరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభమవుతాయన్నారు. మండలంలోని 8,583 మంది క్రీడాకారులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో తలపడనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, ఈఓపీఆర్ అండ్‌ఆర్డీ మహేశ్వర ప్రతాప్, ఎంపీపీ కార్యాలయం ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకూ వన్‌కే రన్ నిర్వహించారు. ఎంపీడీవో రమేష్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో సచివాలయాల వద్ద రన్ నిర్వహించామన్నారు. అనంతరం విజేతలైన 12 మందికి పతకాలు అందించారు. కార్యక్రమంలో ఎస్సై కె.చిరంజీవి, ఎంఈవోలు స్వామి నాయక్, ముత్యాలు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఏవో గోపాల్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భరణి కుమార్, హెచ్ఎం వీరభద్రరావు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం

అనపర్తి: క్రీడలను ప్రోత్సహించడంతో పాటు క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా శనివారం స్థానిక గ్రామ సచివాలయం-1 నుంచి చేపట్టిన 3కే రన్‌ను రామకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా నిర్వహించే క్రీడా పోటీల్లో 15 ఏళ్లు నిండినవారంతా భాగస్వాములయ్యేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి మాట్లాడుతూ ఐదు దశల్లో నిర్వహించే ఈ పోటీల్లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరిగే ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం 3కే రన్‌లో ప్రతిభ కనబరిచిన ఆరుగురు విజేతలకు బహుమతులు అందజేశారు. రామవరం గ్రామ పరిధిలో చేపట్టే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు మద్దతుగా నిర్వహించిన 1కే రన్‌ను అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో అనపర్తి సర్పంచ్ వారా కుమారి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, వార్డు సభ్యులు యాసిడ్‌రాము, ఎస్ఎస్, అనపర్తి, రామవరం గ్రామ సచివాలయాల కార్యదర్శులు మల్లిడి విజయ్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



అనపర్తిలో 3కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సత్తి రామకృష్ణారెడ్డి

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అక్కు జట్టు



పోటీల్లో అక్కు యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించనున్న జట్టు

అనపర్తి: కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో ఖోఖో మెన్స్ విభాగంలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ జట్టు ఈ నెల 24వ తేదీ ఆదివారం కేరళ బయలుదేరనున్నట్లు ఖోఖో మెన్ ఈవెంట్ ఛైర్మన్, స్థానిక జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో భాగంగా ఖోఖో క్రీడాంశంలో అక్కు యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు స్థానిక జీబీఆర్ క్రీడామైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకూ నాలుగు రోజుల పాటు శిక్షణా శిబిరాన్ని నిర్వహించామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఖోఖో ఈవెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి, జీబీఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎంవీవీ రామారెడ్డి, వి.జయరాజు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, విద్యాసంస్థల పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డిలు శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాలపై కచ్చితమైన అవగాహన అవసరం

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులకు జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్ 2015, మానవ అక్రమ రవాణా, ప్రీఅరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశలలో న్యాయ సేవలు తదితర అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ యాక్ట్ 2015పై పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు స్పష్టమైన అవగాహన అవసరమన్నారు. చట్టంతో విభేదించిన పిల్లలతో సదరు అధికారుల వ్యవహార శైలి సాధారణ కేసులలోని నిబంధనలకు భిన్నంగా ఉంటాయన్నారు. వారితో స్నేహపూర్వకంగా, సున్నితంగా వ్యవహరించాలని, ఈ చట్టంలోని నిబంధనలని కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం సదరు అధికారులు పాటించాల్సిన నిబంధనలు, నిషిద్ధమైన చర్యలను వివరించారు. ఒకటో అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జగదీశ్వరి మాట్లాడుతూ ప్రీ అరెస్ట్, అరెస్ట్, రిమాండ్ దశలలో న్యాయసేవలను వివరించారు. 6వ అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.రెడ్డి ప్రసన్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలనలో పోలీసులు, ఇతర అధికారుల పాత్రను, అక్రమ రవాణా బాధితులకు నల్సా న్యాయ సేవల పథకాలను వివరించారు. అనంతరం న్యాయమూర్తి గంధం సునీత, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పీఆర్ రాజీవ్‌లు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ సోమశేఖర్, సౌత్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కొత్తపేట డీఎస్పీ కె.రమణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.ధర్మారావు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యురాలు తబిత, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, చెల్డ్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ఆటోను ఢీకొన్న కారు : మహిళ మృతి

రంగంపేట: ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందినట్టు ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన చెప్పిన వివరాల ప్రకారం రంగంపేట నుంచి కోటపాడు వెళుతున్న ఆటోను సుకృతి లేఅవుట్ ఎదురుగా వెనుక వైపు నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న తోట లక్ష్మి, నాగులపల్లి సత్యనారాయణమ్మ, మండపాక వెంకటలక్ష్మి, ఆటో డ్రైవర్ చాగంటి వీర వెంకట సత్యనారాయణలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికుల సహకారంతో 108 వాహనంలో పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే తోట లక్ష్మి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన వారిని అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తోట లక్ష్మి చిన్న కుమారుడు తోట వీర్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సైకిల్‌ను ఢీకొన్న మోటారు సైకిల్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శివారున శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పురుషోత్తపట్నానికి చెందిన ఎం.విజయ్ రాజమహేంద్రవరం నుంచి మోటారు సైకిల్‌పై వస్తూ రఘుదేవపురం శివారున.. తన ముందు వెళుతున్న సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి కాలు విరగడంతో సీతానగరం బస్టాండ్ సమీపంలోని ఆస్పత్రికి స్థానికులు తరలించారు. విజయ్‌కు 108 అంబులెన్స్ ఈఎంటీ ఎన్.సునీత, పైలట్ మణికుమార్ ప్రథమ చికిత్స చేసి, రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

ముగిసిన షష్ఠి ఉత్సవాలు

మధురపూడి: కోరుకొండలోని వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉల్లి బుజ్జిబాబు, కార్యదర్శి ఒంటిపల్లి సత్యనారాయణ, కోశాధికారి కటకం సత్యనారాయణ, నీరుకొండ బాబ్జీ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన శనివారం గ్రామోత్సవం జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోజన వితరణ చేశారు. రాత్రి జరిగిన సినీ మ్యూజికల్ నైట్ అలరించింది.

నూతన ఎస్ఐ సంధ్యారాణికి సత్కారం



సంధ్యారాణిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

రంగంపేట: ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికైన కోటపాడు గ్రామానికి చెందిన అర్జంగి సంధ్యారాణిని శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు కోటపాడు గ్రామంలోని సంధ్యారాణి ఇంటి వద్ద కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. సంధ్యారాణిని అభినందించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, మండల పరిషత్ విప్ సభ్యుడు సుంకర అప్పారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, మండల జేఏసీ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు రవి, కర్రి శ్రీను ఉన్నారు.